# చీకటి కడుపున వెలుగు నెత్తురు

"అయ్యగారితో మీరు మా ఆయన గురించి చెప్పి కాస్త మందలించమనం డమ్మా - తన ఖర్చుల కో రెండొంద లుంచుకొని తక్కింది ఇంట్లో ఇస్తే, పిల్లల్తో సుఖంగా కాసిని మెతుకులు తింటాం" అంది కమల కన్నీళ్ళు తుడుచుకుంటూ.

ఆఫీసరు సుందర్రామ్మూర్తి భార్య రత్నప్రభ అంత వింది. చెమర్చిన కళ్ళు తుడుచుకుంది. ఏవేవో జ్ఞాపకా లొచ్చి శున్యాల్లోకి చూసి ఏదో ఆలోచనలో పడిపోయింది.

"ఏంటమ్మా? అలా ఏదో ఆలోచిస్తున్నారు?"

"అబ్బే ఏం లేదు కమలా."

"మరి మీ కళ్ళంట నీ రెందు కమ్మా? - మిమ్మల్ని చాలా బాధ పెట్టా నమ్మా నా బతుకులో బాధలన్నీ చెప్పి? నా భర్త తాగుబోతు - తిరుగుబోతు - బాధ్యత తెలియని వట్టి పాషాణం. ఏదో ఉద్యోగం చేసుకుంటున్నాడు కదా నని మా వాళ్ళు ఈయన కిచ్చి చేశారు. కాని ఆయన గుణం అలాటి దైతే ఆడదాన్ని నే నేం చెయ్యగలను చెప్పండమ్మా? ఇంట్లో కానీ ఇవ్వడు - తాగొచ్చి కడుపునిండా కక్కా ముక్కా కావాలంటాడు. పిఠాపురంలో ఉండగా అలాగే చేశాడు. నర్సీపట్నంలో ఉండగా ఎంద రెన్ని చెప్పినా తన బుద్ధి మార్చుకోలేదు. తాగేసి ఆఫీసు పనులు పట్టించుకోడనీ, లంచాలు మరిగినట్లు దాఖలాలు రావడంతో, శ్రీకాకుళం ట్రాన్స్‌ఫర్ చేసేశారు. ఆయన తిరుగుళ్ళ గురించి భార్యగా నాకు చెప్పడానికి సిగ్గే స్తుం దమ్మా!" అంది కమల - తన హృదయంలో వేదన చెప్పుకుంటూంటే సానుభూతి చూపే ఓ స్త్రీ దేవత తనకు తారసిల్లి నందుకు.

"నా కథంత చెప్పి మిమ్మల్ని చాలా బాధపెట్టా నమ్మా."

"కాదు కమలా - నీ లో నన్ను చూసుకున్నాను."

"అంటే ఏంటమ్మా?"

"ఆడవాళ్ళ జీవితాలు ఒక్కోసారి అర్థం కావు. అర్థమయ్యేలా చెప్పేందుకు భాష చాలదు పరిస్థితులు కుదరవు."

"మీరు అయ్యగారితో అంత చెప్పి నా కాపరం నిలబెట్టండమ్మా!" దీనంగా వేడుకుంది కమల.

"కాస్సేపట్లో ఆయనే వచ్చేస్తారు. నువ్వే అన్నీ వివరంగా చెబితే బావుంటుంది" అంది రత్నప్రభ.

"పిల్లల్ని మా అద్దె కొంప పక్క ఓ రిక్షా అతని భార్య కప్పగించి వచ్చా నమ్మా - చీకటిపడితే వాళ్ళు ఏడుస్తారు నా కోసం" దీనంగా చెప్పుకుంది.

"ఎనిమిదీ, పదీ వయస్సులో ఉన్న పిల్ల లంటున్నావ్ - వా ళ్ళేమన్నా పసి గుడ్డులు కాదు నీ కోసం ఏడుస్తూ కూర్చోవడానికి" అంటూ కమలకి నచ్చ జెవుతూనే స్నానానికి వేడినీళ్ళు ఏర్పాటు చేసేసింది.

కమల భయంతో వద్దని బతిమాలినా రత్నప్రభ ఒప్పుకోలేదు. స్నానమైన తర్వాత ఉతికిన చక్కని చీర కట్టుకోవడాని కిచ్చింది.

పోషణా, సుఖం, మానసికవ్యథా, ఈతి బాధలూ, భర్త పెట్టే హింసలూ లేకుంటే కమల మరెంత అందంగా ఉండునో అనుకుంది రత్నప్రభ.

ఇద్దరు కలిసి భోం చేశారు.

ఆ వేళ కమల చాలాకాలం తర్వాత చాలా తృప్తిగా భోంచేసినా, మరో పక్క పిల్లలు తిన్నారో లేదో నన్న క్షోభ. అలాగే భర్త ఆకలితో ఉంటే ఆమె భరించలేదు. పాపం భారతనారి కదా!

"మీ పిల్ల లెక్కడమ్మా?" అడిగింది కమల.

"పరీక్ష లయ్యాయి కదా, మా అన్నయ్య గారింటి కెళ్ళారు."

నిజంగా వాళ్ళు వెళ్ళలేదు. కొంతకాలం బయ టెక్కడైనా కాస్త ప్రశాంతంగా తమ బాల్యం గడుపుతా రనే భావన రత్నప్రభది. ఎందుకంటే ఎదుటివారికి చెప్పుకోలేని అశాంతి తన సంసారంలోనూ తాండవిస్తూంది.

అలసటా, ఆ తర్వాత మానసిక వ్యథా, ఎన్నో రోజులకు కడుపునిండా తిన్న భోజనం వల్లా ఆమెకి కళ్ళు మూతలు పడుతున్నాయి.

"అమ్మా! - అయ్యగా రెప్పుడు వస్తారో ఏమో - నేనింటికి పోతాను" అంది కంగారుపడుతూ కమల.

"ఇంతసేపూ ఉండి వెళ్ళిపోతా నంటే ఎట్లా-?"

"చీకటి పడుతోం దమ్మా - నేను ఇంటికి పోవాలి."

"నేను మీ ఇంటి దగ్గర వదిలి పెడతాను - భయంలేదు - కాస్త అలా ఆ మంచం మీద నడుం వాల్చు" అంటూ ఆమెని బెడ్‌రూంలోకి తీసుకెళ్ళి తలుపు దగ్గరగా చేరవేసి బయటకొచ్చింది రత్నప్రభ.

మెత్తని పరుపు. అందాల ఇల్లు. ఓ పెద్ద ఆఫీసరు గారింట్లో తను. ఆయన భార్య పెద్ద మనసుతో భోజనం కూడా పెట్టింది. తోబుట్టవులా. ఎందరి కింత మంచి హృదయం ఉంటుంది?

అలసటగా ఉన్న శరీరం అలా ఫోం బెడ్ మీద చేరేసరికి కళ్ళు మూతలుపడాయి.

*** *** ***

తన చెంపల్ని నిమురుతున్న స్పర్శకు కమల ఉలిక్కిపడి లేచింది.

ఎదురుగా పురుషాకారం. ఎవరై ఉంటారు? ఆ డ్రెస్సూ, అదీ చూస్తుంటే ఆయనే ఈ ఇంటి యజమాని కావచ్చు. తా నెవ్వరితో తన బాధలు విన్నవించుకోవా లనుకుంటూందో ఆ మహానుభావుడే అయి ఉండొచ్చు.

మనిషి దగ్గర మత్తు పానీయపు వాసన తలదిమ్మెక్కేలా ఉంది. తూలుతున్నాడు. కళ్ళు ఎరుపెక్కాయి. మనిషిలో కాఠిన్యం.

"ఎవరు నువ్వు - ఆ గంగరాజు నిన్ను సరాసరి ఇక్కడికి బుక్ చేశాడా యేం? - ఇది నా ఇల్లు - అయినా ఫర్వాలేదు."

మత్తులో ఉన్న సుందర్రామ్మూర్తికి కమల చాలా అందంగా, అమాయకంగా కనిపిస్తూంటే లోకాన్ని మరిచి పోయాడు.

కమల బెడ్ మీంచి దిగి వణికిపోతోంది.

"ఆ తలుపు మూసిరా." ఆజ్ఞాపించాడు.

"నేను - నేను - నన్ను కమల అంటారండీ - మీ ఆఫీసులో పనిచేసే పరశురాం భార్యని. తమతో రెండు ముక్కలు చెప్పుకోవడాని కొచ్చానండీ." ఏం మాట్లాడాలో ఆ ఒంటరి సమయంలో ఆమెకు తెలియడం లేదు.

" ఆ వెధవ తాగుబోతు పరుశురాం గాడి కింత అందమైన పెళ్ళాం ఉందా?"

సుందర్రామ్మూర్తి తిన్నగా వెళ్ళి బట్టలు మార్చుకుని మళ్ళీ వచ్చాడు.

"బాబూ! నా భర్త తాగుబోతు - తిరుగుబోతు. వచ్చిన జీతం తన విలాసాలకే చాలదు. అందుకని ....." చెప్ప బోతోంది.

"సరాసరి నా బెడ్ రూంకే వచ్చావా? - వెరీ గుడ్, ఎంత కావాలి?"

"అది కాదు బాబూ! - అన్ని సంగతులూ అమ్మగారితో చెప్పుకున్నాను."

"ఓహో! - అదా? - అదేం చెయ్యగలదు? ఆఫ్టరాల్ ఓ డది... తాగడం, తిరగడం మగాడి కా దేవు డిచ్చిన పర్మినెంట్ లైసెన్స్" అంటూ కమల చెయ్యి పట్టుకున్నాడు.

"అమ్మగారూ!" అంటూ కేకలేస్తూ విడిపించుకునేందుకు ప్రయత్నిస్తోంది.

సుందర్రామ్మూర్తి ఆమెను రెండు చేతుల్తో ఎత్తి లోనగదిలోకి తీసుకుపోతున్నాడు రాక్షసుడిలా.

"ఆగండి!" అన్న గర్జనకు పిడుగు పడ్డట్టు స్థాణువై పోయాడు సుందర్రామ్మూర్తి.

కమల అతని చేతుల్లోంచి జారి, రత్నప్రభ దగ్గరకు పరిగెత్తు కొచ్చింది.


"నువ్వా?"

"పన్నెండు సంవత్సరాలనుంచి కాపురం చేస్తున్న భార్యని." కాలుతున్న కాగడాలా ఉంది రత్నప్రభ.

ఈ పరిస్థితి నెలా ఎదుర్కోవాలో నని చూస్తున్నాడు అతను.

"నే నెవరో మీరు మరిచిపోతే పర్వాలేదు - కాని ఆ మెవరో తెలుసా? - మీ ఆఫీసులో పనిచేసే పరుశురాం అనే ఓ తాగుబోతుకీ, తిరుగుబోతుకీ అర్థాంగి - ఆమె మీరు పిలిచిన కాల్ గర్ల్ కాదు.

— సింహమూర్తి



తన మానం అమ్ముకోవడానికొచ్చిన ఆడదీ కాదు.''

అతను కోపంతో బుసలు కొడుతున్నాడు.

"తన భర్త తాగుబోతనీ, తిరుగుబోతనీ తన సంసారం నాశనం చేస్తున్నాడనీ బాధ్యతగల పదవిలో ఉన్న మీతో చెప్పుకుంటే తన భర్తని మందలించి మంచి మార్గంలో పెడతారని మీతో చెప్పుకోడానికొచ్చిం దామె. కాని మీరు కూడా రోజూ గొంతుదాకా తాగుతారనీ, క్లబ్బుల్లో అమ్మాయిల్తో తిరుగుతారనీ, రేసుల్లో వేలకొద్ది తగలేస్తారనీ, మీ సంసారాన్ని కూడా నరకమయం చేసేశారనీ పాపం ఆ అమాయకురాలికి తెలీదు'' అంది ఆవేశంగా రత్నప్రభ.

"నా కాపురం వీధిని పడకుండా రక్షించుకునేందుకూ, నా భర్తని మంచిగా మార్చుకునేందుకూ ఓ చెల్లెల్లా మీ సాయం కోరడానికి కొస్తే ఇదా బాబు మీరు చెయాల్సింది?'' కమల తెగేసి అడిగింది.

"అలాగే మీ భార్యగా నాకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకోడానికి మీ పై అధికారి దగ్గర కెళ్తే, అతను కూడా ఇలాగే ప్రవర్తిస్తే? - అవకాశం దొరికింది కదా అని అతని పక్కలో చేరి మిమ్మల్ని వెక్కిరిస్తే?''రత్నప్రభ ఒక్కో మాటా కత్తిపోటులా ఉంది.

సుందర్రామ్మూర్తిలో అహం! అధికారమదం!

అంతస్థూ, హోదాల కైపు. అన్నింటికన్నా మగవాణ్ణన్న మొండి బలం.

"నా ప్రశ్నకి సమాధానం కావాలి'' మళ్ళీ రెట్టించింది రత్నప్రభ.

అతని గొంతులోంచి వికృతంగా ఓ నవ్వు.

"సమాధానం మీ నుంచి రాదు. ఎందుకంటే నాలు గ్గోడల మధ్యా, అంధకారంలో బందీగా కూర్చుని న్యాయం కోసం అర్థిస్తే మా లాటివాళ్ళ బ్రతుకుల్లో వెలుగు రాదు. అందుకే చీకటిలోంచి వెలుగులో కెళ్ళాలి. ఆ వెలుగే మా నరాల్లో నెత్తురై పారాలి'' అంటూ రత్నప్రభ కమలతో వీధిలోకి నడిచింది. *